కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట మాజీ సర్పంచ్‌ల ధర్నా

మహబూబాబాద్ రూరల్, జూన్ 16 : పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ లక్ష్మణ్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పలువురు మాజీ సర్పంచ్‌లు ధర్నా నిర్వహించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 16 నెలలు దాటినా ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని, ఈ నెల 20లోపు పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే జిల్లాలోని 461 మంది మాజీ సర్పంచ్‌లను ఏకం చేసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా నాయకులు నవీన్‌రావు, బోడ శ్రీను, మంగీలాల్, పరశురాం, రామారావు, గుట్టయ్య, హరిలాల్, నరసింహ, బాలూనాయక్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కూతురిని గర్నమెంట్ స్కూల్‌లో చేర్పించిన ఉపాధ్యాయుడు

కేసముద్రం : మండలంలోని కల్వల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సయ్యద్ నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన కూతురు తయ్యిబును సోమవారం కల్వల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. ఉపాధ్యాయుడు తన కూతురిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

కల్వల ప్రాథమిక పాఠశాలలో తన కూతురిని చేర్పిస్తున్న ఉపాధ్యాయుడు

మూగ జీవాల మృత్యువాత

- ఊపిరి తీసిన కరెంటు తీగలు
- విద్యుత్ తీగలు తగిలి ఆరు పశువుల మృతి
- పీక్లానాయక్ తండాలో విషాదం
- అధికారుల అలసత్వమే కారణమని రైతుల ఆందోళన

విద్యుత్ తీగ తగిలి మృతిచెందిన పశువులు

కురవి: రోడ్డుపై ఆందోళన నిర్వహిస్తున్న రైతులు

కురవి (సీరోలు), జూన్ 16 : కరెంటు తీగలు తగిలి మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. పంట పొలాల్లో తెగిపడిన విద్యుత్ తీగలు పశువుల ఊపిరి తీశాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ ఆవు లు మృతిచెందాయని రైతులు కంటతడి పెట్టుకున్నారు. తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. సీరోలు మండలంలోని బూర్గుచెట్టుతండా గ్రామపంచాయతీ పరి ధి పీక్లా నాయక్ తండాలోని ఐదుగురు రైతులకు చెందిన ఆరు పశువులు కరెంటు తీగలు తగిలి మృతిచెందాయి. మరో రైతుకు చెందిన ఆవుకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే.. ఉప్పరిగూడెం సమీపంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని పంట పొలాల్లో తెగి పడిన విద్యుత్ తీగలు తగిలి పీక్లాతండాకు చెందిన తేజావత్ వీరన్న, తేజావత్ రమేశ్, తేజావత్ వెంకన్న, బానోత్ నరేశ్, బానోత్ తేజు, బానోత్ సేవా అనే రైతులకు చెందిన ఐదు ఆవులు, ఒక ఎద్దు షార్ట్ సర్క్యూట్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి. ఇదే ఘటనలో బానోత్ ఈరుకు చెందిన మరో ఆవుకు గాయాలయ్యాయి. విద్యుత్ అధికారులు అలసత్వమే తమ పశువుల మృతికి కారణమని ఆగ్రహం వ్యక్తం చేస్తూ రైతులు 365 ఏ జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏడీఈ రమేశ్, సీరోలు ఎస్సై నగేశ్, వెటర్నరీ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. నష్టపరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఒక్కొక్కరికి రూ.80వేల నుంచి రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. తక్షణ పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల వీచిన ఈదురు గాలులకు పంట పొలాలు, గ్రామాల్లో కరెంటు తీగలు తెగిపడ్డాయి. వాటిని వెనువెంటనే సరి చేయాల్సిన విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు రైతులు ఆరోపించారు. ఇకపోతే ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు రైతులు పొలంబాట పడుతున్నారు. ఏ తీగ ఎక్కడ ప్రాణాలను హరిస్తుందోనని భయపడుతున్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తీగలు తెగినట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

మరిపెడ: కేటీఆర్‌కు మద్దతుగా తెలంగాణ భవన్ వద్ద మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, నాయకులు

పెద్దవంగర: కేటీఆర్‌కు సంఘీభావంగా తరలిన బీఆర్‌ఎస్ నేతలు

కేటీఆర్‌కు మద్దతుగా తరలిన నేతలు

మరిపెడ, జూన్ 16 : ఫార్ములా– ఈ రేసు కేసులో ఏసీబీ విచారణకు హాజరవుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మద్దతుగా సోమవారం తెలంగాణ భవన్‌కు డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌తోపాటు డోర్నకల్ నియోజకవర్గ నాయకులు తరలివెళ్లారు. వరంగల్ జిల్లా ఓడీసీఎంఎస్ మాజీ చైర్మన్ కుడితి మహేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ విద్యాసాగర్, మాజీ ఎంపీపీ బాలూనాయక్, సీనియర్ నాయకులు భిక్షంరెడ్డి, తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

పెద్దవంగర నుంచి ..

పెద్దవంగర : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఏసీబీ విచారించనున్న నేపథ్యంలో సోమవారం పలువురు బీఆర్‌ఎస్ నేతలు సంఘీభావం తెలిపేందుకు పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలివెళ్లారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు, ఎన్నారై పీ సునీల్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, సంజయ్, నేతలు సుధీర్‌కుమార్, సమ్మయ్య, వెంకట్రామయ్య, వెంకన్న, రవి, అనుదీప్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

35 రైతు వేదికల్లో 'రైతు నేస్తం'

మహబూబాబాద్ రూరల్, జూన్ 16 : జిల్లాలోని వివిధ మండలాల్లో ఉన్న 35 రైతు వేదికల్లో సోమవారం 'రైతు నేస్తం' కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 'రైతు నేస్తం' ప్రోగ్రాం వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. ఈ రైతు నేస్తం ప్రోగ్రాంలో మండలంలోని మల్యాల గ్రామ రైతు వేదిక నుంచి ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని ఏటిగడ్డ తండా రైతు వేదికలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి పాల్గొన్నారు. రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో మండలానికి చెందిన మహిళా రైతు ద్వాలీ తనకు ప్రభుత్వం రూ.1,65,500 రుణమాఫీ చేసిందని, రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు అందించిందని సీఎం రేవంత్‌రెడ్డితో తన ఆనందాన్ని పంచుకున్నది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం..

మహబూబాబాద్ రూరల్/గూడూరు, జూన్ 16 : పేదల సొంతింటి కల సాకారమవుతుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. సోమవారం ఆయన మహబూబాబాద్ మండలంలోని సోమ్లాతండా, పర్వతగిరి గ్రామాల్లో, గూడూరు మండలం గూడూరు జీపీ పరిధిలో ఆయన పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు అందజేసి, ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాంరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, బాలాజీనాయక్, అశోక్, నవీన్, రాజు, నాగయ్య, నరేశ్, శ్రీను, ప్రశాంత్, లావణ్య, స్వర్ణలత , గూడూరు తహసీల్దార్ నాగభవాని, ఎంపీవో సత్యనారాయణ, ఎన్ఎంసీ వైస్ చైర్మన్ నరేశ్‌రెడ్డి, నాయకులు వెంకన్న, కొమ్మాలు, శ్రీపాల్‌రెడ్డి, రసూల్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

నర్సింహులపేట, జూన్ 16: ఆకేరువాగు నుంచి అనుమతి లేకుండా రాత్రి, పగలు వందలాది ట్రాక్టర్లు నడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు, స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. పగలంతా వ్యవసాయ, కూలీ పనులకు వెళ్లి, రాత్రి నిద్రలేకుండా గడపాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి మండలంలోని జయపురం గ్రామంలో ప్రజలు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రోడ్డుపై వెళ్లకుండా కాళీ ట్రాక్టర్లను అడ్డుపెట్టారు. దీంతో రాత్రంతా ఆగిన ఇసుక ట్రాక్టర్లు సోమవారం మళ్లీ మొదలు కావడంతో బక్కతండా రైతులు అడ్డుకున్నారు. రైతులే ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక ట్రాక్టర్లకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

నెల్లికుదురు, జూన్ 16 : ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ నరేశ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మధనతుర్తిలోని ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌లో భద్రపరిచినట్లు తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

కేసముద్రం, జూన్ 16 : మండలంలోని కేసముద్రం విలేజ్ గ్రామంలో ఉన్న కిరాణా షాపులో చోరీ జరిగినట్లు బాధితుడు వేంశెట్టి వేణు సోమవారం తెలిపాడు. బాధితుడి కథనం ప్రకారం.. వేణు ఆదివారం రాత్రి కిరాణా షాపు మూసివేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి షాపు తెరిచి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి 100కు ఫోన్ చేశాడు. రూ.12 వేల విలువ గల మద్యం, రూ.6 వేల నగదు అపహరించినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

రైలు నుంచి జారి పడి ఒకరి మృతి

డోర్నకల్, జూన్16 : రైలు నుంచి జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ , గుండ్రాతి మడుగు రైల్వే స్టేషన్ మధ్య సోమవారం జరిగింది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్, గుండ్రాతి మడుగు రైల్వేస్టేషన్ 441/30కి.మీ దిగువ లైన్ రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడు. మహబూబాబాద్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలోని మార్చురీలో భద్ర పరిచారు. మృతుడు తెలుపు రంగు బనీయన్, నెక్కర్ ధరించి ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించలేదు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

మరిపెడ, జూన్ 16 : పురపాలక సంఘం పరిధిలోని మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి సోమవారం తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు విధిగా బిల్లులు ఇవ్వాలని, కాలం చెల్లిన మందులు లేకుండా జాగ్రత్త పడాలని దుకాణా యజమానులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: నలుగురికి గాయాలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 16 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి గాయాలైన ఘటన సోమవారం మహబూబాబాద్‌లో జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. బయ్యారం మండలం జగత్‌రావుపేట శివారు బోటిమీదతండాలోని ఒకే కుటుంబానికి అమలాదేవి (26) గణేశ్, సురేశ్, మంజుల, రంగ్యా అందరూ కలిసి కురవి గ్రామంలో జరిగే సంతకు గొర్రెపోతులు కొనడానికి ఆటోలో వెళ్తున్నారు. ముందు ఆర్టీసీ బస్సు వెళ్తుండగా వెనకాల ఆటో ఉన్నది. బేతోలు క్రాస్ వద్ద ఒక్కసారిగా బస్సు ఆగగా, ఆటో అదుపు తప్పి బస్సును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అమలాదేవి అక్కడికక్కడే మృతి చెందగా, గణేశ్, సురేశ్, మంజుల, రంగ్యాకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏరియా వైద్యశాలకు తరలించారు. అమలాదేవికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. చిన్న పిల్లలను వదిలేసి వెళ్లిపోయావా.. అంటూ ఆమె భర్త ఏడుస్తున్న తీరు చుట్ట పక్కల వాళ్లను కంటతడి పెట్టించింది.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

పెద్దవంగర, జూన్ 16 : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని అవుతాపురం గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్సై క్రాంతికిరణ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మహమ్మద్ నజీర్ (35) కుటుంబ సమస్యలతో తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు..

తొర్రూరు, జూన్ 16 : పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తొర్రూరు మండలం కర్కాల గ్రామంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్కాల గ్రామానికి చెందిన ఎర్ర సోమయ్య (77) రెండేళ్లుగా బీపీ, షుగర్, కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చికిత్స పొందినా ఆరోగ్యం బాగుపడకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, జూన్ 16 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో అక్రమ డిప్యుటేషన్ల ద్వారా అనేక మందివిధులు నిర్వర్తిస్తున్నారని, డాక్టర్ల డ్యూటీ విధానం, పర్యవేక్షణ జిల్లా వైద్యాధికారి సక్రమంగా నిర్వర్తించడం లేదని జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మట్టూరి నాగేశ్వరరావు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గార్ల మండలం చిన్న కిష్టాపురానికి చెందిన జ్యోతి తాను ఉండడానికి ఇల్లు లేదని, ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని వినతి పత్రం అందజేసింది. జిల్లాలోని మొత్తం వివిధ శాఖలకు 97 వినతులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రాజ్, హరిప్రసాద్, నరసింహస్వామి, సురేశ్ పాల్గొన్నారు.

రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

తొర్రూరు, జూన్ 16 : తొర్రూరు మండలం చర్లపాలెం పాఠశాలలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)గా విధులు నిర్వర్తిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగి సర్వీ రమేశ్(42) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విద్యారంగ అభివృద్ధికి 13 ఏళ్ల పాటు అహర్నిశలు శ్రమించిన రమేశ్ మృతిపై ఉద్యోగుల సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వరంగల్– ఖమ్మం హైవేపై నిరసన వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.50 లక్షలఎక్స్ గ్రేషియా, రమేశ్ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెల్తూరి మల్లేశం, రాష్ట్ర అధ్యక్షుడు రేగుల సహదేవ్, జిల్లా అధ్యక్షుడు జానకీరామ్, షేక్‌ఖాదర్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహబూబ్ పాషా, కోశాధికారి మహేందర్, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, బాబూలాల్ పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

నమస్తే నెట్‌వర్క్: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూళ్లలో 2025–26 విద్యా సంవత్సరానికి 4వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 18, 19న బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. 18న మరిపెడ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో, 18న ఇనుగుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో , 19న కేసముద్రం మండల కేంద్రంలోని స్టేషన్ జిల్లాపరిషత్ సెకండరీ పాఠశాలలో , డోర్నకల్ మండల కేంద్రం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో , పెద్దవంగర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో , అలాగే తొర్రూరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తి గల బాలబాలికలు 3వ తరగతి స్టడీ సర్టిఫికెట్స్, పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, మూడో తరగతి మార్కుల కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలి. 2016 సెప్టెంబర్ ఒకటి నుంచి 2017 ఆగస్టు 30 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూళ్లలో బాలురకు 20, బాలికలకు 20 చొప్పున సీట్లు ఉన్నాయి. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయికి పంపిస్తారు.

కూతురికి న్యాయం చేయాలని తండ్రి ఆత్మహత్యాయత్నం

డోర్నకల్ పోలీసుస్టేషన్ సమీపంలో ఘటన

డోర్నకల్ , జూన్ 16 : ఓ యువకుడు తన కూతురికి అన్యాయం చేశాడంటూ తండ్రి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. డోర్నకల్ మండలంలోని ఓ తండాకు చెందిన బీ.సురేశ్ తన కుమార్తెను ఓ యువకుడు ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్నాడంటూ సోమవారం పోలీస్‌స్టేషన్ సమీపంలో పురుగుల మందు తాగాడు. మూడు నెలలు క్రితం ఈ విషయంలో సదరు యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. బాలికకు మేజర్ అయ్యాక వివాహం చేయాలని ఇరు కుటుంబ సభ్యులు పెద్ద మనుషుల సమక్షంలో అంగీకరించినట్లు తెలిసింది. కాగా మేజరైన బాలికను వివాహం చేసుకోవాలని తండ్రి సురేశ్ కోరగా యువకుడు నిరాకరించడంతో అతడు సోమవారం పురుగులమందు తాగుతుండగా బాటిల్‌ను లాక్కొని పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆటోలో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గడ్డినివారణ మందుతాగి ఒకరు మృతి

ఇనుగుర్తి, జూన్ 16 : గడ్డి నివారణ మందు తాగి ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్ కథనం ప్రకారం.. మండలంలోని కోమటిపల్లికి చెందిన బొల్ల నాగరాజు(37) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం సాయంత్రం తన వ్యవసాయ బావి దగ్గర గడ్డినివారణ మందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతడి తండ్రి అబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబానికి సాయం

కేసముద్రం, జూన్16 : కేసముద్రం విలేజ్‌కు చెందిన గుండెబోయిన నాగరాజు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. సోమవారం రాధాకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో అతడి భార్య హేమ, కొడుకులు రిశాంక్, కృశాంక్‌కు రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం విలేజ్ రోడ్డు వాడకు చెందిన రాధాకృష్ణ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ రేకుల చోరీ

బయ్యారం, జూన్ 16: సెంట్రింగ్ రేకులు చోరీకి గురైన ఘటన బయ్యారం మండల కేంద్రం శివారులోని సాయిబాబా గుడి సమీపంలో సోమవారం జరిగింది. మండలకేంద్రానికి చెందిన వేమల ఉప్పలయ్య వ్యవసాయ క్షేత్రంలోని కొట్టం వద్ద ఉంచిన 40 సెంట్రింగ్ రేకులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వీటి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రైతులకు కొత్త రుణాలు అందించాలి

గార్ల, జూన్ 16: రైతులకు కొత్త పంట రుణాలు అందించి ఆదుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులకు వానకాలం కొత్త రుణాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్, జంపాల వెంకన్న, భాగం రమేశ్, మాగం లోకేశ్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

గార్ల, జూన్ 16: భూ భారతిలో దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని న్యూడెమోక్రసీ నాయకుడు జీ సక్రు సోమవారం తహసీల్దార్‌ను కోరారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రైతులకు పట్టా పాస్ పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజన రైతులకు కాకుండా గిరిజనేతర రైతులకు కూడా పాస్ పుస్తకాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్ కోసమే 'ఆపరేషన్ కగార్'

బయ్యారం, జూన్ 16 : ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకే కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను చేపట్టిందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు అన్నారు. అధర్మ యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ వెంకట్రాంపురంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారు దేశ సంపద, ఆదివాసీ ప్రాంతాల్లోని ఖనిజ సంపదను బడా పెట్టుబడిదారులకు తెగనమ్మడానికి కుట్రలు చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా కేంద్రం ఆపరేషన్ కగార్ ఆపేసి, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని కోరారు.

మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి, జూన్ 16: ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న మహాధర్నా పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 17న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నల్లబెల్లం, పటిక పట్టివేత

నర్సింహులపేట, జూన్ 16: మండలంలోని నర్సింహాపురంబంజర జీపీ పరిధిలోని లాలితండాలో నల్లబెల్లం, పటిక పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. సోమవారం రాత్రి నిషేధిత నల్లబెల్లం రెండు బస్తాలు, 5 బస్తాల పటిక పట్టుకొని లాలితండాకు చెందిన గుగులోత్ నరేశ్, రాజేశ్, బాలాజీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నల్లబెల్లం, పటిక అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

సదస్సులతోనే భూ సమస్యల పరిష్కారం

మరిపెడ : రెవెన్యూ సదస్సులతోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని మరిపెడ తహసీల్దార్ కృష్ణవేణి అన్నారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని ఆడిటోరియం, పురపాలక సంఘం కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శరత్ చంద్రగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ లారీ, బొలెరో వాహనం ఢీ

ఒకరి మృతి, నలుగురికి గాయాలు

మహబూబాబాద్ రూరల్, జూన్ 16: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మహబూబాబాద్ మండల శివారులోని ఉత్తరతండా సమీపంలో గుర్రాలగుట్ట క్రాస్ రోడ్డు వద్ద సోమవారం రాత్రి జరిగింది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం బొలెరో వాహనంలో ఇల్లందులో శుభకార్యానికి వెళ్లి వస్తుండగా, ఉత్తరతండా సమీపంలో గుర్రాలగుట్ట క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చిన్ననాగారం గ్రామానికి గుగులోత్ రాజు(30)అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా కుటుంబ సభ్యులు గుగులోత్ కిషన్, హుస్సేన్, పాత్యా, భూక్యా శ్రీను తీవ్ర గాయాలు కాగా, ఏరియా వైద్యశాలకు తరలించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కేసముద్రం, జూన్16 : మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు సోమవారం అర్చకులు చతుస్థానార్చన, మహాపూర్ణాహుతి, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధ్యక్షుడు వోలం మురళి, సెక్రటరీ పరమేశ్వర్, కోశాధికారి యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, నాగరాజు, సంతోష్, నర్సయ్య పాల్గొన్నారు.

WANTED CHEMISTRY FACULTY
A reputed English Medium High School in HANUMAKONDA requires CHEMISTRY FACULTY to deal IIT Foundation from 6th to 10th Classes.
Interested and Experienced Candidates may Contact Immediately. ★ Attractive Salary
Cell: 9989734513

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF
jobs Apply Now!
★PHARMACY BOYS (Experienced)
★LAB TECHNICIANS (Experienced)
★COMPUTER OPERATORS & SUPERVISORS
Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2 PM.
NTW-522

WANTED
★ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10th, ఇంటర్, డిగ్రీ పాసైనవారు అర్హులు. ఆకర్షణీయమైన జీతం రూం+భోజనం ఫ్రీ, ఇన్సెంటివ్స్ కలవు. సెల్: 7337378927, 7842425065.
NTW-337101

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

BUSINESS OFFER
★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

CHANGE OF NAME
I, KANDIKONDA TEJASRI D/o KANDIKONDA POSHALU R/o. 27-8-7, Shanthi Nagar, Hasanparthy, Hanumakonda, Warangal, TG, 506371. Change My Name As NEDUNURI TEJASRI W/o NEDUNURI KOTESHWAR RAO For All Puposes.

CHANGE OF NAME
I, BHUKYA SOMLA NAIK R/o H.No. 31-3-2021, Road No.3, Venkateswara Colony, TNGOS Phase-2, 100 Feet Road, Waddepally, Hanamkonda Mandal, Hanumakonda District-506 370. T.G. Have Changed My Name From BHUKYA SOMLA to BHUKYA SOMLA NAIK For All Puposes.

CHANGE OF NAME
I, NELLI SHIRISHA D/o NELLI SATHISH, R/o H.No. 1-3/A, Karepalli Village, Singareni Mandal, Khammam District-507122. T.G. Have Changed My Name From NILLI SANGEETHA to NELLI SHIRISHA For All Puposes.

CHANGE OF NAME
★I, SHAIK MUSTAFA HYDER ZIYAD (Old Name) H.NO.3-16-189/15/A/1, Dreamland Colony, Near Pothana College, KU Road, Hanumakonda City & Dist-506011. T.G. Have Changed my Name from SHAIK MUSTAFA HYDER ZIYAD TO SHAIKH MUSTAFA HYDER ZIYAD (New Name) S/o SHAIK MUJAB HYDER THARIQ for all purposes.
NTW-6707

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565